అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఏర్పాటు చేస్తాం



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో నూతన కార్యవర్గ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండీ కూడలిలో అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గరికపోగుల చంద్రశేఖర్ నేతృత్వంలోని కొత్త కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు గడ్డం ప్రసాద్, విద్యాసాగర్, చలపతి, భాస్కర్ గిరి, కృష్ణ, అంబాల రాజేశ్వర్ రావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వసంత నవరాత్రి మహోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కోదండ రామాలయంలో వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ ఘట్టంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ విఠలయ్య, శ్రీభూలక్ష్మీ అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్ సూదం పేర్కొన్నారు.

5న నోటరీ అడ్వకేట్ల రాష్ట్రస్థాయి సమావేశం

బన్సీలాల్‌పేట్: తెలంగాణలోని నోటరీ అడ్వకేట్ల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 5న రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలంగాణ అడ్వకేట్ నోటరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంజి యాదగిరి, కార్యదర్శి మయబ్రహ్మ నరసింహ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదుట భోలక్‌పూర్‌లోని ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి నోటరీ అడ్వకేట్లు పెద్ద ఎత్తున సమావేశానికి హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

అధ్యాపకుల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అధ్యాపకుల ప్రమోషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని పలువురు ప్రొఫెసర్లు వీసీ ప్రొ.కుమార్‌ను మంగళవారం కలిసి విజ్ఞప్తి చ చేశారు. సీఏఎస్ కింద (కేరీర్ అడ్వాన్స్ స్కీమ్) ప్రతి 6 నెలలకు ఒకసారి నిర్వహించే ఉద్యోగోన్నతలకు గతేడాది నుంచి ఇంటర్వ్యూలు చేపట్టడం లేదన్నారు. వెంటనే స్పందించి ఇంటర్వ్యూలు జరపలని కోరారు.

ఔటా ఎన్నికలు నిర్వహించాలి

ఔటా ఎన్నికలు (ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) నిర్వహించాలని పలువురు ప్రొఫెసర్లు అధికారులను కోరారు. గత ఔటా కార్యవర్గ కాలపరిమితి ముగిసి 3 నెలలు గడిచినా ఇప్పటివరకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ప్రతి రెండేళ్లకు ఒక్కసారి ఓయూ అధికారికంగా నిర్వహించే ఔటా ఎన్నికల్లో తీవ్ర జాప్యం వల్ల అధ్యాపకుల సమస్యలపై మాట్లాడేవారే లేరని సీనియర్ అధ్యాపకులు వాపోతున్నారు.

హెచ్‌సీయూ భూముల స్వాధీనం ఆపాలి

ముషీరాబాద్: అనేక రకాల వృక్షాలు, జంతువులకు, పర్యావరణానికి నిలయంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ కంచ భూములను స్వాధీనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ విధానం దౌర్జన్యపూరితంగా ఉందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. పండుగ సెలవులు, రాత్రుల్లో పెద్ద ఎత్తున చెట్లను ధ్వంసం చేయడంపై యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు నిరసన తెలుపుతుంటే వారిపై లాఠీచార్జి, అరెస్టులు చేసి అక్రమ కేసులు బనాయించడం నిరంకుశత్వానికి నిదర్శనమని అన్నారు. తక్షణమే హెచ్‌సీయూ భూములు స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను మానుకోవాలని హితువు పలికారు. గత ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ఆదాయం కోసమని భూముల్ని కంపెనీలకు అప్పగించారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గోల చేసి అధికారంలో ఉన్నప్పుడు ఇదే పాలసీని ఇంకా తీవ్రంగా అనుసరిస్తారని విమర్శించారు. విద్యార్థులు, పౌర సమాజం, విద్యార్థి సంఘాలు ఐక్యంగా కదిలి ప్రభుత్వ చర్యపై బలమైన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

నిలువ నీడ కరువాయే..!

- జామై ఉస్మానియా-సికింద్రాబాద్ రూట్‌లో కానరానీ బస్‌షెల్టర్లు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు,
- పట్టని అధికారులు



వారాసీగూడ చౌరస్తా వద్ద బస్‌షెల్టర్ లేక షాపు ఎదుట బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

బౌద్ధనగర్: ఓ వైపు దంచికొడుతున్న ఎండలు.. మరోవైపు నిల్చునేందుకు కానరానీ బస్టాప్‌లు, ఇంకోవైపు వేళకు రానీ ఆర్టీసీ బస్సులు వెరసి ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా జామై ఉస్మానియా-సికింద్రాబాద్ రూట్‌లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

కానరానీ షెల్టర్లు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి కాచిగూడ, దిల్‌సుఖ్‌నగర్ వరకు ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సు చిలకలగూడ, సీతాఫల్‌మండి, వారాసీగూడ, ఆర్ట్స్ కాలేజ్, జామై ఉస్మానియా మీదుగా దిల్‌సుఖ్‌నగర్ వరకు వెళ్లి వస్తుంటాయి. ప్రతి స్టాప్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఈ రూట్‌లోని వారాసీగూడ, ఆర్ట్స్‌కాలేజ్, జామై ఉస్మానియా తదితర ప్రాంతాల్లో ఎక్కడ కూడా బస్ షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు వర్షాకాలంలో వానకు, వేసవిలో ఎండకు విలవిలలాడిపోతున్నారు. ప్రస్తుతం నగరంలో విపరీతమైన ఎండ వేడిమి ఉండగా మరోవైపు బస్ షెల్టర్లు లేక ప్రజలు షాపుల ఎదుట , చెట్ల కింద తలదాల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎన్నో రోజులుగా ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నా అటు జీహెచ్ఎంసీ అధికారులు కానీ, ఇటు ఆర్టీసీ అధికారులు కానీ స్పందించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



ఆర్ట్స్ కాలేజీ రైల్వేస్టేషన్ బస్టాప్ చెట్ల కింద..

ఎండలోనే వేచి చూడాల్సి వస్తోంది..



బస్‌షెల్టర్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు వచ్చేవరకు ఎండలోనే వేచి చూడాల్సి వస్తోంది. ఎండవేడికి తట్టుకోలేక షాపుల ముందు నిల్చుంటే ఆయా యజమానులు వెల్లగొడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– సత్యప్రకాశ్, ప్రయాణికుడు

తెలంగాణ ఉద్యమకారుల పోస్టర్ ఆవిష్కరణ



ప్లీనరీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ఈనెల 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ప్లీనరీ పోస్టర్‌ను సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ మెనీఫెస్టోలో పెట్టిన తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, రూ. 25 వేల పింఛన్, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 21న చేపట్టిన ప్లీనరీని విజయవంతం చేసేందుకు తనవంతూ సహకారం అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు జానకిరెడ్డి, రాంబాబు, దయానంద్, జగన్‌యాదవ్, ఆర్‌కే భూపాల్, లక్ష్మణ్, నరసింహ చారి తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ ఉత్సవాలకు రండి

లాలాపేట: తార్నాక డివిజన్‌కు చెందిన మాదిగ సంఘాల నాయకులు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఆయన నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 5న తార్నాక డివిజన్ శాంతినగర్ చౌరస్తాలో సాయంత్రం 6 గంటలకు నిర్వహించనున్న మాజీ ఉప ప్రధాని డా. బాబు జగ్జీవన్‌రామ్ జయంతి (సమతా దివస్) ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల నాయకులు ముత్యాల గీతాదయాకర్‌రావు, అనసూయమ్మ, మణెమ్మ, వీరబాబు, మహేశ్, కుమార్‌షాను, మల్లికార్జున్, ప్రభాకర్, యాదగిరి ఉన్నారు.



మందకృష్ణ మాదిగకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

ఉత్సాహంగా జై బాపు, జై భీమ్, జైసంవిధాన్ కార్యక్రమం



కార్యక్రమంలో కోట నీలిమా తదితరులు

సనత్‌నగర్: టీపీసీసీ ఆధ్వర్యంలో ఏఐసీసీ 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట డివిజన్లలో మంగళవారం నిర్వహించారు. సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమా నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలను ప్రోత్సహించే ప్రమాణాన్ని స్వీకరించారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలను పురుద్ఘాటిస్తూ, రాజ్యాంగంపై నిబద్ధతను కలిగి ఉండాలనే ఉద్దేశంతోనే కార్యక్రమాన్ని తలపెట్టినట్లు కోట నీలిమా తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు హేమంత్‌సింగ్, అనురాగ్, హనీఫ్, చిరంజీవి, రజనీకాంత్, ఎస్ఎఎస్ రావు, అబ్బాస్ షరీఫ్, విజయ్ ఎలీషా, సీనియర్ నేతలు, మహిళలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తులసీ పూజ

సనత్‌నగర్: సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో మోడల్‌కాలనీ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న వసంత నవరాత్రుల్లో భాగంగా మూడో రోజు తారక నామ సహిత తులసీ పూజ (108 సార్లు), హనుమాన్ చాలీసా పారాయణం (5 సార్లు) భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పిల్లలకు శ్రీమద్‌రామాయణంలోని బాలకాండపై ప్రవచనాలు చేశారు. శ్రీలక్ష్మీ నరసింహారెడ్డి పిల్లలతో స్వామి వారి భజన చేయించారు. పిల్లల కోసం రామాయణంలో రోజుకోక కాండపై ప్రవచిస్తున్నట్లు సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి సభ్యుడు బుచ్చిబాబు తెలిపారు. హారిక, పావని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తులసీ పూజలో చిన్నారులు

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

హిమాయత్‌నగర్: ఈ నెలలో జరగనున్న మహనీయుల జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. సమితి రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శులు బొడ్డుపల్లి కృష్ణ, చింతకింది కుమార స్వామితో కలిసి మంగళవారం ఆయన మాట్లాడారు. ఈనెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి, 14న అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అందుకు అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కార్యాచరణ చేపట్టాలని కోరారు. దేశం కోసం, తమ జాతి కోసం తమ మేధస్సును అంకితం చేసిన ఆ మహనీయుల స్ఫూర్తిని నేటి తరం యువతకు తెలియజేయాలన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికం 40, పచ్చకాకర 35, పందిరి బీర 45, క్యాబేజీ 8, క్యారెట్ 19, దొండ 35, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 13, దోసకాయ 18, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 23, కందగడ్డ 75, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 18, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

హెచ్‌సీయూలో ఆందోళనల వెనుక అదృశ్య శక్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: హెచ్‌సీయూ విద్యార్థుల ఆందోళన వెనుక అదృశ్య శక్తులు ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 400 ఎకరాల విషయంలో బీఆర్ఎస్, బీజేపీ విద్యార్థులకు తప్పుడు సంకేతాలు ఇస్తున్నాయని, హెచ్‌సీయూ భూములు అంగుళం కూడా ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. తెలంగాణ యువతకు విద్య ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సీఎం రేవంత్ రెడ్డి ఆరాటమన్నారు. ఈ విషయమై తెలంగాణ విద్యార్థులు, మేధావులు ఆలోచించాలని కోరారు.

సినీ నిర్మాతపై ఫిర్యాదు

ఆల్విన్‌కాలనీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నిర్మాత పంజాల జైహింద్ గౌడ్‌పై కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వీరమల్ల కేశవరావు ఆధ్వర్యంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 11 సంవత్సరాల్లో బీసీ కమిషన్ ఏర్పాటు చేస్తూ చట్టబద్ధత కల్పించడంతో పాటు కేంద్ర మంత్రులలో ఎక్కువమంది బీసీలకు స్థానం కల్పించారన్నారు. మన రాష్ట్రం నుంచి బీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మణ్‌ను నియమించారని గుర్తు చేశారు. బీసీల సంక్షేమానికి పాటుపడుతున్న నరేంద్ర మోదీ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన జైహింద్‌గౌడ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం



భోజన పంపిణీ కేంద్రం వద్ద అన్నం తింటున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

అమీర్‌పేట: సేవా దృక్పథం కలిగి ఉండడం అభినందనీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ బీకేగూడ పార్కు వద్ద శ్రీనివాస సమాజ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న మిత భోజన పంపిణీ, చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా మధ్యాహ్న మిత భోజనం పంపిణీ చేపడుతున్నారని, ఇందుకు సుమారు 250 మంది దాతలు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఇది నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పార్థసారథి, కౌన్సిల్ అధ్యక్షుడు దుబే, మాజీ అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, సహదేవ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్ రావు, కట్ట బల్‌రాం, అశోక్ యాదవ్, నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, గోపీలాల్ చౌహన్, ప్రవీణ్‌రెడ్డి, ఖలీల్, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సికింద్రాబాద్ సర్కిల్ ఆస్తిపన్ను వసూళ్లు రూ.28.41 కోట్లు

టార్గెట్ రూ.25.50 కోట్లు..
అదనంగా రూ.2.60 కోట్ల వసూలు



సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు ఆస్తిపన్ను వసూళ్లలో రికార్డు సాధించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.25.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకోగా అదనంగా రూ.2.60 కోట్లు వసూలు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్ రావు మంగళవారం తెలిపారు. ఇందుకు సహకరించిన సర్కిల్ ట్యాక్స్ విభాగం అధికారులు, ఉద్యోగులను అభినందించారు. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని 5 మున్సిపల్ డివిజన్లలో మొత్తం 55 వేల భవనాల నుంచి ఆస్తిపన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాలు, వివాదాస్పద భవనాల నుంచి రావాల్సిన బకాయిలు మినహాయించి గతేడాది వసూలు లక్ష్యం రూ. 25 కోట్లు కాగా రూ.16 కోట్లు మాత్రమే రాబట్టగలిగారు. ఈ ఏడాది మాత్రం రూ.25.50 లక్ష్యం కాగా లక్ష్యానికి మించి రూ.28.41 కోట్లు వసూలు చేశారు. ఇదిలా ఉండగా ఎర్లీబర్డ్ పేరుతో ఏప్రిల్‌లో ముందస్తు ఆస్తి పన్ను వసూలు కార్యక్రమాన్ని కూడా జీహెచ్‌ఎంసీ అందుబాటులోకి తెచ్చిందని ఆయన చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నును ఈనెల 31 లోగా చెల్లిస్తే పన్నులో 5 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు. బకాయిలు లేనివారు మాత్రమే ఎర్లీబర్డ్ పథకానికి అర్హులని ఆయన తెలిపారు.

చెంచు కుటుంబాలకు గృహోపకరణ వస్తువుల పంపిణీ



గృహోపకరణ వస్తువులతో చెంచులు, అధికారులు

సనత్‌నగర్: ట్రాన్స్‌కో అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ క్లెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నల్లమల అడవుల్లోని అమ్రాబాద్ రిజర్వ్ ఫారెస్ట్ కొల్లం చెంచుపెంట గ్రామంలో మంగళవారం పర్యటించారు. వారి యోగక్షేమాలు, జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే 20 కుటుంబాలకు గృహోపకరణ వస్తువులు, దుస్తులను అందజేశారు. శ్రీమాతా సేవా సమితి ప్రతినిధులు కుసుమ విజయ, ట్రాన్స్‌కో అధికారులు రాజశేఖర్, ఉద్యోగులు సుధాకర్‌రెడ్డి, అరుణ్ కుమార్, సర్వేశ్వర్, మారం శ్రీనివాస్, అశోక్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ బాధితురాలికి చేయూత

పద్మారావునగర్: మధుమేహంతో బాధపడుతున్న బన్సీలాల్‌పేట్ డివిజన్ జయనగర్ కాలనీకి చెందిన పూజిత (17)కు ఓ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. పూజిత కొన్నేళ్లుగా షుగర్‌తో బాధపడుతోంది. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో ఇన్సులిన్ ఇతరత్రా మందులు కొనుగోలు చేయడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్డీ) స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చింది. ఎస్ఆర్డీ అధినేత సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇంద్రభారతి జయనగర్‌లోని బాధితురాలి ఇంటికి మంగళవారం వచ్చి పూజితకు మందులు, రేషన్ సరకులు అందజేశారు. దీంతో పూజిత కుటుంబీకులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.



పూజితకు సరకులు, మందులు అందజేస్తున్న దృశ్యం

మోతీనగర్ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న మోతీనగర్ వాసులు

మోతీనగర్: మోతీనగర్‌లో నెలకొన్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కృష్ణారావును కోరారు. ఈ మేరకు మంగళవారం మోతీనగర్ వాసులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌ల పరిధిలోని పలు బస్తీ కాలనీల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ పనుల తరువాత వ్యర్థాలను మోతీనగర్ మీ సేవ సమీపంలోని పార్కు స్థలంలో డంపింగ్ చేస్తున్నారని, దీంతో దుర్గంధం, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. నెలల కొద్దీ వ్యర్థాలను పార్కు స్థలంలో ఉంచడటంతో అదే మట్టిని చదునుగా చేసి కుప్పలుగా పోస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాసరావు, వెంకటస్వామి, హేమంతరావు, శ్రీహరి, అగర్వాల్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేద్దామా స్విమ్మింగ్!

- నేటి నుంచి అందుబాటులోకి సనత్‌నగర్ ఈత కొలను
- రెండేళ్ల తర్వాత పునః ప్రారంభం

సనత్‌నగర్: వేసవిలో జలకాలాటాలకు వేళయ్యింది. నిప్పులు కక్కుతున్న సూరీడు నుంచి కాస్త ఉపశమనం పొందేందుకు స్విమ్మింగ్ ప్రియులకు సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని ఈత కొలను ఈనెల 2 (నేటి) నుంచి అందుబాటులోకి రానుంది. వాస్తవంగా చలికాలంలో 3 నెలల పాటు స్విమ్మింగ్‌పూల్‌ను మూసేసి ఉంచుతారు. అయితే గతేడాది వేసవికి ముందు ఓ బాలుడు ఇదే ఈత కొలనులో పడి మృతి చెందడంతో అప్పడు ఓపెన్ కాలేదు. మళ్లీ రెండేళ్ల తర్వాత అందుబాటులోకి తీసుకువస్తున్నారు. గత రెండు నెలలుగా స్విమ్మింగ్ పూల్‌లోని ఓ బోర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లోని మరో బోర్ నీటిని నింపుతూ వచ్చారు. 5.50 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం (సుమారు 160 ట్యాంక్‌లు) ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను సామర్థ్యానికి తగ్గట్లుగా నీటితో నింపడంతో పాటు ఇక్కడికి ఈత కోసం వచ్చేవారు స్నానాలు చేసేందుకు బ్యాలెన్సింగ్ ట్యాంక్‌ను సైతం 50 వేల లీటర్ల నీటితో నింపారు.



ప్రారంభానికి సిద్ధమైన సనత్‌నగర్ ఈత కొలను

బ్యాచ్‌ల వారీగా..

సనత్‌నగర్ ఈత కొలను నేటి నుంచి అందుబాటులోకి రానుండడంతో ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని స్విమ్మింగ్ పూల్ ఇన్‌చార్జి మంగళవారం తెలిపారు. రోజుకు 8 బ్యాచ్‌ల చొప్పున స్విమ్మింగ్‌పూల్‌ను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

- ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, 7–8, 8–9, 9–10, 10–11 వరకు 5 బ్యాచ్‌లు ఉంటాయి.
- మధ్యాహ్నం 3–4 గంటల వరకు, 4–5, 5–6 వరకు 3 బ్యాచ్‌లు.
- అయితే మధ్యాహ్నం 3–4 గంటల వరకు కొనసాగే బ్యాచ్ మాత్రం కేవలం మహిళలకే పరిమితం చేశారు.
- ఒక్కో బ్యాచ్‌కు 50–60 మందిని మాత్రమే అనుమతిస్తారు.
- అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత www.ghmc.gov.in/sports వెబ్‌సైట్‌కు లాగిన్ అయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నెలవారీ ఫీజు రూ.500 లుగా నిర్ణయించారు.
- స్విమ్మింగ్ చేసేవారు వైద్యుడు ధ్రువీకరించిన మెడికల్ సర్టిఫికెట్‌ను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

వచ్చేవారంలో అమీర్‌పేట స్విమ్మింగ్ పూల్ ..

అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని గురుగోబింద్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చే చర్యలు చేపట్టారు. జలమండలి పైప్‌లైన్ ద్వారా సరఫరా చేసే నీటితో పాటు ట్యాంకర్లతో ఈత కొలనులో నీటిని నింపే పనులు కొనసాగుతున్నాయి. మరో 3, 4 రోజుల్లో స్విమ్మింగ్‌పూల్‌ను పూర్తిగా నింపి వచ్చే వారం అందుబాటులోకి తీసుకురావాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది.